క్లుప్తంగా

నేడు కారంచేడులో స్పందన

కారంచేడు: మండల కేంద్రం కారంచేడులో సోమవారం ఉదయం 11 గంటలకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహశీల్దారు ఎస్ వెంకటరత్నం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన రైతులు, విద్యార్థులు, ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు వారికి అవసరమైన అర్జీలు పెట్టుకోవచ్చన్నారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మధ్యాహ్నం 2గంటలకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండలంలో అన్ని గ్రామాలకు చెందిన వీఆర్ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

స్పందనకు అధికారులు హాజరుకావాలి

చీరాల టౌన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రజా విజ్ఞప్తుల దినం స్పందన కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు విధిగా హాజరుకావాలని తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. తహశీల్దార్ కార్యాలయంలో జరిగే స్పందన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అన్నీ ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావాలని సర్క్యులర్ జారీ చేశారని తహశీల్దార్ తెలిపారు. అన్నీ ప్రభుత్వ శాఖలకు చెందిన మండలస్థాయి అధికారులు విధిగా స్పందనకు హాజరు కావాలన్నారు.

ఆధ్యాత్మికతవైపు నడిపించడమే ఉద్దేశం

చీరాల రూరల్: విశ్వవ్యాప్తంగా అన్ని దేశాల్లోని ప్రజలను ఆధ్యాత్మికతవైపు నడిపించడమే విశ్వవాణి ఉద్దేశమని విశ్వవాణి తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ రెవరెండ్ డాక్టర్ ఈఆర్. రాబర్ట్ అన్నారు. స్థానిక చర్చి కాంపౌండ్‌లోని సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చిలో ఆదివారం విశ్వవాణి దినోత్సవాన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా రాబర్ట్ వాక్య సందేశం ఇస్తూ ప్రభువైన ఏసుక్రీస్తు మనల్ని ఎంతగానో ప్రేమించాడని, ఆయన మన కోసం మన పాపాల నుంచి విముక్తులను చేసేందుకు తన ప్రాణాలనే శిలువలో పణంగా పెట్టాడని గుర్తు చేశారు. క్రీస్తు మనపై చూపిన ప్రేమను ఇతరులపై మనం కూడా చూపించాలని సూచించారు. కార్యక్రమానికి ముందుగా సంఘ కాపరులు రెవరెండ్స్ కొమ్మిన జోసఫ్ కేరి, పిల్లి దేవదాసులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి చైర్మన్ దేటా అశోక్ కుమార్, ట్రెజరర్ యెరిచర్ల రమేష్‌బాబు, పీసీసీ, ఎల్‌సీసీ, యూత్, సంఘస్థులు పాల్గొన్నారు.

నేడు పంచాయతీ కార్యదర్శుల సమావేశం

చీరాల టౌన్: మండలంలోని అన్నీ గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లతో సోమవారం సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో నేతాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరయ్యే పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లు విధిగా పంచాయతీ, సచివాలయాల సమాచారం, అభివృద్ధి పనుల వివరాలతో విధిగా హాజరుకావాలని ఎంపీడీవో సూచించారు.

సమాజ సేవలో యువత ముందుండాలి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణరావు

చీరాల అర్బన్: సమాజ సేవ చేయడానికి సత్యసాయి యువజన విభాగం ఎల్లప్పుడు సిద్ధంగా ఉండాలని సత్యసాయి సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు అన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల యూత్ కో ఆర్డీనేటర్‌లు, మెడికల్ కో ఆర్డీనేటర్‌లు రెండు రోజుల సమావేశం చీరాలలోని బాపనమ్మ కళ్యాణ మండపంలో ఆదివారం ముగిసింది. బాబా శత జయంతి సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో భాగంగా యువత చేపట్టాల్సిన కార్యక్రమాలు, వైద్యపర కార్యక్రమాల ప్రణాళికను సిద్ధం చేసుకొని యువతలో స్ఫూర్తి నింపేందుకు సమావేశం నిర్వహించామన్నారు. శిబిరంలో ఉపాధ్యక్షులు చుండూరి సురేంద్ర, రాష్ట్ర యూత్ కో ఆర్డినేటర్‌లు కళ్యాణ్, స్నేహలత, యువజన సమన్వయ కర్తలు, మెడికల్ సమన్వయ కర్తలు, సేవాదళ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం సహకారం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

మేదరమెట్ల: గ్రామాభివృద్ధి కోసం ఎవరు ముందుకు వచ్చినా పంచాయతీ సహకారం పూర్తిగా ఉంటుందని మేదరమెట్ల సర్పంచ్ బొనిగల ఎలీశమ్మ అన్నారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల పైలాన్ సమీపంలో ధృతి డెవలప్పర్స్ ఆధ్వర్యంలో ద్వారకా నగర్ పేరుతో నూతన వెంచర్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డెవలప్పర్స్ నిర్వాహకులు మణికుమార్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేస్తున్న వెంచర్ నందు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నిర్మాణం, త్రీస్టార్ హోటల్, కన్వెన్షన్ హాల్ ఏర్పాటు చేస్తారన్నారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్టేట్ కన్వీనర్ అట్ల చినవెంకటరెడ్డి, ఐడీపీఎస్ ఏపీ జీఎం రామరాజు, సింగమనేని శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



వెలగ



గన్నేరు



గానుగ



చింత

- ఈదురు గాలులు తట్టుకునే రకాలే మేలు
- అవగాహనతోనే పది కాలాలపాటు పచ్చదనం

మొక్క నిలవాలి.. పచ్చదనం పరచాలి

వేటపాలెం:

పచ్చదనాన్ని చూస్తే చాలు.. మనసుక ప్రశాంతత, ఆహ్లాదంగా ఉంటుంది. ఆకు పచ్చని రంగులో ఏదో తెలియని మహత్యం ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగన్న పచ్చతోరణంలో భాగంగా గ్రీన్ బాపట్ల పేరుతో మూడు లక్షల మొక్కలు నాటారు. అయితే ఈదురు గాలులను తట్టుకునే మొక్కల పెంపకంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ, అటవీ శాఖల ఆధ్వర్యంలో జిల్లాలో వివిధ నర్సరీలు కొనసాగుతున్నాయి. అందులో లక్షల మొక్కలు పెంచుతున్నారు. జిల్లాలోని నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు వాటిలో ఈదురు గాలులకు తట్టు కునే రకాలపై దృష్టిసారించాల్సి ఉంది.

నిదానమే ప్రధానం..

ప్రస్తుతం కొత్తగా రోడ్లకు ఇరువైపులా అతి త్వరగా పెరిగే చెట్లకు ప్రాధాన్యత ఇవ్వకుండా మన వాతావరణానికి తగిన రావి, గానుగ, చింత, తుమ్మ, మద్ది, నేరేడు, వేప, చెట్లను పెంచడంతో పచ్చదనం పెరగడంతో పాటు స్వచ్ఛమైన గాలి వస్తుంది. వీటి పెరుగుదల నెమ్మదిగా ఉన్నా జీవితకాలం 60 నుంచి 70 ఏళ్ల వరకు ఉంటుంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఉపాధిహామీ కింద ఏర్పాటు చేసిన వివిధ నర్సరీల్లో అన్ని రకాలు మొక్కలు అందుబాటులో ఉన్నాయి.

త్వరగా పెరిగి నీడనిచ్చినా నిలవవు...

కొన్ని రకాల మొక్కలు రెండేళ్లకే త్వరగా పెరిగి నీడనిచ్చే పెద్ద చెట్టుగా ఏదుగుతాయి. సాధారణ గాలి, వర్షానికే వీటి కొమ్మలు విరిగిపోతాయి. సాధారణ గాలి, వర్షానికే వీటి కొమ్మలు విరిగి పోతాయి. ఇందుకు ప్రధాన కారణం వీటి వేర్లు నేలపై పొరల్లోనే ఉండటమే. భూమి లోపలికి చొచ్చుకు వెళ్లవు, ఫలితంగా భారీ ఈదురు గాలులు వీస్తే వేళ్లతో సహా కూలిపోతాయి. ఈ మొక్కల జీవితకాలం సైతం 15 నుంచి 20 ఏళ్ల మాత్రమే ఉంటుందని ఉపాధి, అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ప్రధానంగా టేకు, రావి, నల్లమద్ది, నెమలినార, ఉసిరి, తెల్ల మద్ది, చింత, ఇప్ప, వేర్లు భూమిలోకి లోతులోకి వెళ్లటంతో మొదలు భాగం గట్టిగా ఉంటుంది. భారీ ఈదురు గాలులను తట్టుకుంటాయి. అటవీ శాఖ ద్వారా వన నర్సరీల్లో ఎర్రతురాయి, పచ్చ తురాయి, వెలగ, వేప, చామతం గేడు, దేవగాంచన, గానుగ, నేరేడు, మద్ది, టేకు, చిస్, నెమళి, గుమ్మ టేకు, గంగరేగి మొక్కలు సిద్ధంగా ఉన్నాయి.

180 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



పోలీస్ స్టేషన్ వద్ద రేషన్ లోడుతో ఉన్న లారీ

వేటపాలెం: పేదలు తినే బియ్యాన్ని కొందరు అక్రమార్కులు పక్కదారి పట్టిస్తున్నారు. వేటపాలెం నుంచి ఉప్పుగుండూరు వైపునకు లారీలో తరలిస్తున్న 180 బస్తాల రేషన్ బియ్యం ఆదివారం తెల్లవారు జామున బాపట్ల ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. బాపట్ల ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు వచ్చిన సమాచారం మేరకు రామన్నపేట తహశీల్దార్ కార్యాలయం వద్ద చీరాల-ఒంగోలు ప్రధాన రహదారిలో లారీని తనిఖీ చేశారు. ఈ తనిఖీలో రేషన్ బియ్యంతో వెళ్తున్న లారీని పట్టుకొన్నారు. బియ్యం లోడుతో పాటు లారీని స్వాధీనం చేసుకొని వేటపాలెం పోలీసు స్టేషన్‌కి తరలించారు. లారీ డ్రైవర్ పరారయ్యాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శాస్త్రీయ దృక్పథం చాలా అవసరం



మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామారావు

అద్దంకి రూరల్: సమాజానికి, భావితరాలకు ఉపయోగపడే మానవ పరిణామ సిద్ధాంతాలను పాఠ్యాంశాల నుంచి తొలగిస్తున్నారని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుర్ర రామారావు అన్నారు. ఆదివారం స్థానిక బంగ్లారోడ్‌లోని చిన్ని శాంతయ్య సేవాసదన్‌లో జన విజ్ఞాన వేదిక 17వ జిల్లా మహాసభలు జరిగాయి. ఈ సభలకు కావూరి రఘుచంద్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా కుర్రరామారావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సామాజిక విలువలతో కూడిన శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో తొలుతగా ప్రకాశం జిల్లా గౌరవాధ్యక్షుడు ఏవీ పుల్లారావు జెండా ఎగురవేశారు. అనంతరం చెకుముకి టాలెంట్ టెస్ట్ విజేతలైన బోదవాడ జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థినులు భవనం శివాని, దివ్య, గీతం హై స్కూల్ మేదరమెట్ల విద్యార్థులు మనోహతేజ, సీహెచ్‌వర్షిణి, కే సైదాబాబులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలోజనవిజ్ఞాన వేదిక అద్దంకి డివిజన్ గౌరవాధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు, జేవీవీ బాపట్ల జిల్లా కోశాధికారి తంగా శ్రీనివాసరావు, సీహెచ్ గంగయ్య, జేవీవీ అద్దంకి డివిజన్ అధ్యక్షుడు బీ. చంద్రశేఖర్, డి. రవీంద్రబాబు, కె. పోతురాజు, వై హనుమంతరావు, యు. భాస్కరరావు, సుభాని, అడుగుల శ్రీనివాసరావు, సోమేపల్లి హనుమంతరావు, ప్రభుదాసు, పి. కృష్ణారావు, గుంజి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సమాజ సేవలో రోటరీ క్లబ్ ముందంజ



బహిరంగ ప్రదర్శన నిర్వహిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

పర్చూరు (చినగంజాం): సమాజ సేవలో రోటరీ క్లబ్ ఎంతో కాలంగా ఎన్నో కార్యక్రమాలు, సేవలు అందిస్తూ తరిస్తుందని పర్చూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం పర్చూరులో రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో రోటరీలో చేరండి అనే నినాదంతో బహిరంగ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు రోటరీలో చేరి సేవా కార్యక్రమాల్లో పాల్గొని సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం ప్రోత్సహిస్తూ సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటివరకు పర్చూరు రోటరీ క్లబ్ చేసిన పర్చూరు వాటర్ ప్లాంట్, ప్రజా మరుగుదొడ్లు, ఓవర్ హెడ్ ట్యాంకు, రోటరీ సామాజిక వర్గం భవనం, నూతలపాడు వాటర్ ప్లాంట్, ఆదిపూడి వాటర్ ప్లాంట్, చెక్ డ్యాం ఫోటోలు ప్రదర్శించారు. కార్యక్రమంలో కార్యదర్శి పంబి సదానంద రెడ్డి, సభ్యులు కోమటి ఆంజనేయులు, దండా శ్రీనివాసరావు, తోకల కృష్ణమోహన్, పాబోలు వెంకటేశ్వర్లు, పోలిశెట్టి చంద్రశేఖర్‌రావు, కోడూరు సుబ్రమణ్యం, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జనసేన నేత ఆమంచి స్వాములకు 41 నోటీసులు



పోలీస్ స్టేషన్‌లో 41 నోటీసులు అందుకుంటున్న స్వాములు

వేటపాలెం: జనసేన నేత ఆమంచి శ్రీనివాసరావు (స్వాములు)లకు 41 నోటీసులు అందించినట్లు ఎస్సై జీ సురేష్ ఆదివారం తెలిపారు. శనివారం పందిళ్లపల్లిలో స్వాములు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి కరణం వెంకటేష్‌ను పరుష పదజాలంతో దూషిస్తూ తీసిన వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేసినట్లు తెలిపారు. దీని వల్ల నియోజకవర్గంలో ఉద్రిక్త వాతావరణ ఏర్పడిందని, రెచ్చగొట్టే విధంగా ఉండటంతో అతనిపై 152-ఏ కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి స్వాములకు నోటీసు ఇచ్చామన్నారు.

అవయవదానంపై అవగాహన

చినగంజాం: అవయవదానంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని భారత్ నిర్మాణ్ వలంటీర్ ఈ గోవిందస్వామి అన్నారు. అవయవదాన దినోత్సవం సందర్భంగా స్థానిక సోపిరాల గేటు సెంటర్‌లో ఆయన ప్రజలకు అవయవదానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలతో పోల్చుకుంటే మన దేశంలో వాహనాల సంఖ్య తక్కువన్నారు. అయినప్పటికీ రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. ప్రమాదాలకు కారణం హెల్మెట్ ధరించక పోవడం, సీటు బెల్టు ధరించక పోవడం, రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలను పాటించక పోవడం కారణమని అన్నారు. కార్యక్రమంలో స్థానిక యువకులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న భారత్ నిర్మాణ్ వలంటీర్

అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం

అద్దంకి రూరల్: అక్రమంగా మద్యం నిల్వచేసి అమ్మకాలు నిర్వహిస్తున్న రెస్టారెంట్ బెల్ట్ షాపులపై సీఐ రమేష్‌బాబు ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. 36 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. సీఐ వివరాల మేరకు.. ధర్మవరం, శంఖవరప్పాడు గ్రామాల్లోని బెల్టు షాపు కమ్ రెస్టారెంట్‌లపై దాడులు నిర్వహించగా ధర్మవరంలో 13 బీరు బాటిళ్లు, రెండు ఫుల్ మద్యం బాటిళ్లు, శంఖవరప్పాడు 21 చిన్నబాటిళ్లు స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి సోమవారం కోర్టుకు హాజరు పరచనున్నట్లు తెలిపారు.

పర్చూరు (చినగంజాం): పర్చూరు మండలంలోని నూతలపాడు గ్రామంలో ఎస్ఐ ఎన్‌సీ ప్రసాద్ ఆధ్వర్యంలో పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ 10500 లు నగదు స్వాధీనం చేసుకున్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

చీరాల టౌన్: ప్రజలందరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని దేవాంగపురి గ్రామ పంచాయితీ సెక్రటరీ, ఇన్‌చార్జి ఈవోఆర్డీ మురళీబాపూజీ సూచించారు. ఆదివారం గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని గుమ్మస్తాలకాలనీ, కృపానగర్, హస్తినాపురం, తదితర ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వార్డుల్లో పేరుకుని ఉన్న చెత్తకుప్పలను, చిల్లచెట్లను తొలగించి బ్లీచింగ్ చల్లించారు.

నాగిరెడ్డికి ఉత్తమ జాతీయ పురస్కారం



నాగిరెడ్డిని సత్కరిస్తున్న నిర్వాహకులు

కారంచేడు: మండలంలోని యర్రంవారిపాలెం గ్రామానికి చెందిన మదర్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు మున్నంగి నాగిరెడ్డికి ఉత్తమ జాతీయ పురస్కారం లభించింది. ఆదివారం గుంటూరు జిల్లా పొన్నూరులో స్థానిక ఎమ్మెల్యే కిలారు వెంకట రోశయ్య ముఖ్య అతిథిగా హాజరైన కార్యక్రమంలో ఆయనకు పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ సొసైటీ, పొన్నూరు పట్టణ కిరాణా మర్చంట్స్ సంయుక్త సహకారంతో స్థానిక కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ పురస్కారం అందించారు. రక్తదానం చేయడంలో విశేష కృషి చేస్తున్న నాగిరెడ్డి సేవలకు పురస్కారం అందించామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో చందు సాంబశివరావు, బ్లడ్ సొసైటీ చైర్మన్ దామా మధుసూదనరావు, రంగిశెట్టి రమేష్‌లు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

జే.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు రోటరీ క్లబ్ వారి ఆధ్వర్యంలో గుంటూరు శంకర్ కంటి వైద్యశాల సహకారంతో అదివారం పంగులూరులో ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. శిబిరంలో 205 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 175 మంది కంటి శుక్లాలు ఉన్నట్లు గుర్తించారు. కంటి శుక్లాలు ఉన్నటు వంటిని గుర్తించి వారికి గుంటూరు శంకర్ కంటి వైద్యశాలలో ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత ఆపరేషన్లు చయనున్నట్లు తెలిపారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు కరణం వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శంకర్ కంటి వైద్యశాల డాక్టర్లు, రోటేరియన్లు తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడి

బల్లికురవ: కోడిపందేలు వేస్తున్నట్లు సమాచారం అందటంతో ఆదివారం బల్లికురవ ఎస్సై వీ. వేమన సిబ్బందితో దాడులు చేపట్టారు. మండలంలోని రామాంజనేయపురం గ్రామం నుంచి బొగ్గులకొండ వెళ్లే రోడ్‌లో కోడిపందేలు వేస్తుండగా 2 కోళ్లు, 10 మంది జూదరులు, రూ.12,200 నగదును స్వాధీన పరుచుకున్నారు. కోడిపందేలు, పేకాట ఆడటం చట్టరీత్యా నేరమని ఎంతటి వారిపైనైనా కేసులు నమోదుతో కోర్టుకు హాజరు పరుస్తామని ఎస్సై హెచ్చరించారు. జూదం ఆడుతున్న వారి సమాచారాన్ని స్థానికులు పోలీస్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్సై వివరించారు.

నలుగురు జూదరులు, నగదు స్వాధీనం

బల్లికురవ: పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందటంతో ఆదివారం సాయంత్రం బల్లికురవ ఎస్సై వీ. వేమన సిబ్బందితో దాడులు చేపట్టారు. బల్లికురవలోని 33/11 కేవీ సబ్ విద్యుత్ స్టేషన్ ఎదురుగా పొలాల్లో కోత ముక్కాట ఆడుతున్న నలుగురు జూదరులను అదుపులోకి తీసుకుని రూ.5500 నగదు స్వాధీన పరుచుకున్నట్లు ఎస్సై వివరించారు.

వలపర్ల గ్రామంలో..

మార్టూరు: మండలంలోని వలపర్ల గ్రామంలో ఆదివారం సాయంత్రం పేకాట స్థావరంపై మార్టూరు పోలీసులు దాడి చేశారు. ఎస్సై కే కమలాకర్ వివరాల మేరకు.. గ్రామం వెలుపల పేకాట ఆడుతున్నారని ముందస్తు సమాచారంతో ఎస్ఐ కమలాకర్ తమ సిబ్బందితో దాడి నిర్వహించారు. అందులో భాగంగా పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోనికి తీసుకొని వారి నుంచి రూ 5200 లు నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వైభవంగా పోలేరమ్మ కొలుపులు



కారంచేడు: కొలుపుల్లో అమ్మవారి చిత్రపటం

కారంచేడు: ప్రతి ఏటా సాగుకు ముందు గ్రామ దేవత పోలేరమ్మ తల్లికి కొలుపులు నిర్వహించడం గ్రామ ఆనవాయితీ. దీనిలో భాగంగా ఈ ఏడాది వ్యవసాయ పనులు ప్రారంభానికి ముందుగా గ్రామంలోని జోగన్నగారి బజారుకు చెందిన కొలుపులను ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి నుంచే గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. చిన్నారుల కోలాటంతో గ్రామంలో పెద్ద ఎత్తున సంబరం నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారికి తలంటు స్నానాలు ఆచరించి, పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం గ్రామ దేవతను ప్రత్యేకంగా అలంకరించిన ప్రత్యేక వాహనంపై ఉంచి ఊరేగించారు. యువతీ, యువకులు వీరతాళ్లతో అమ్మవారి ప్రతిమకు ముందు నృత్యాలు చేశారు.

గ్రామ దేవతలకు పూజలు..

బల్లికురవ: వర్షాలు కురవాలని పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని ఆదివారం మండలంలో గ్రామ దేవతలకుపూజలు నిర్వహించారు. అధిక శ్రావణ మాసం, త్రయోదశి సందర్భంగా బల్లికురవ సమీపంలోని ఈర్ల గంగమ్మ, నక్కబొక్కలపాడు, కొణిదెన, కె రాజుపాలెం, వేమవరం, గంగపాలెం, మల్లాయపాలెం, ఉప్పుమాగులూరు, సోమవరప్పాడు, కొప్పరపాలెం, చెన్నుపల్లి గ్రామాల్లో గ్రామ దేవతలైన పోలేరమ్మ, మహాలక్ష్మమ్మ, అంకమ్మ ఆలయాల్లో వార్లు పోసి ప్రత్యేక పూజలు చేపట్టారు. వర్షాలు కురవాలని ప్రార్థిస్తూ పొంగళ్లు, చద్ది పెట్టి అమ్మవార్లకు నివేదించారు.

అవధానంలో దిట్ట బాలసుబ్రహ్మణ్యం



అవధానిని సన్మానిస్తున్న మిత్రమండలి సభ్యులు

అద్దంకి: అష్టావధాన, శతావధానాల్లో దిట్ట నారాయణం బాలసుబ్రహ్మణ్యం అని లక్కరాజు చంద్రశేఖర్ అన్నారు. స్థానిక రామసుశీల నిలయంలో ఆదివారం సాహితీ మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన నారాయణం బాలసుబ్రహ్మణ్యం ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ అవధానం ఒక పద్యక్రీడ అని చెప్పారు. ఆ క్రీడను పండించాలంటే అవధానికి జ్ఞాపకశక్తితో పాటు, చలోక్తులు, హాస్యోక్తులు, పురాణాలపై అవగాహన, చరిత్రపై పట్టు, సమకాలీన సమాజంలో జరిగే, రాజకీయ అంశాలపై పట్టు ఉండాల్సి ఉంటుందన్నారు. అందులో ఆరితేరిన వ్యక్తి నారాయణం వారని చెప్పారు. సభకు సంచాలకత్వం వహించిన పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ వివిధ అంశాలపై సభలో అవధానికి పరీక్ష ఉంటుందన్నారు. అన్ని అంశాలపై పట్టున్న వ్యక్తి మన నారాయణం బాలసుబ్రహ్మణ్యమన్నారు. పద్యం పుట్టిన గడ్డపై 350 అష్టావధానాలు, మూడో శతావధానాన్ని చేయడం అభినందనీయమన్నారు. నారాయణం దంపతులను పూలమాల, శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమం సృజన ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సాహితీవేత్త గాడేపల్లి దివాకరదత్తు, వారణాశి రఘురామశర్మ, చిన్ని మురళీకృష్ణ, సాహితీ మిత్రమండలి సభ్యులు చుండూరి మురళీ సుధాకరరావు, చప్పిడి వీరయ్య, కేవీ పోలిరెడ్డి, వెంకటేశ్వర్లు, ఇలపావులూరి శేషతల్పశాయి, ఓరుగంటి ప్రసాదరావు, లక్కరాజు విశ్వమోహన్, మిట్టా కామేశ్వర శర్మ, అద్దంకి లెవీ ప్రసాద్, కూరపాటి రామకోటేశ్వరరావు, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

మణిపూర్ నిందితులను శిక్షించాలి



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

యద్దనపూడి: మణిపూర్ రాష్ట్రంలో జరిగిన మారణ కాండకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ యూనైటెడ్ ఫాస్టర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని పూనూరు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పూనూరు చర్చి సెంటర్ నుంచి బీసీ, ఓసీ కాలనీల మీదుగా భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. తొలుత ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి క్రైస్తవులపై కక్షపూరితంగా దాడులకు పాల్పడటమే కాక మహిళలను నగ్నంగా ఊరేగిస్తూ దొరికినవారిని దొరికినట్లు చంపేస్తున్నారన్నారన్నారు. సభ్యసమాజంలో ఇలాంటి చర్యలకు ఎవరైనా పాల్పడతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడికి నైతిక బాధ్యత వహిస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే రాజీనామా చేయాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూపీఎఫ్ ప్రెసిడెంట్ ఎమ్. జీవన్, ఏఈఎల్‌సీ పాస్టర్ రాజేష్, దైవజనులు ఎమ్ ఆశీర్వాదం, ఆదామ్, బాస్కర్, యిర్మియా, సంసోన్, అబ్రహం, మండలంలోని ఆయా గ్రామాల్లోని క్రైస్తవులు పాల్గొన్నారు.